ఎల్లలు దాటి... ఎంబీబీఎస్!

సొంత రాష్ట్రంలో, స్వదేశంలో వైద్యవిద్య చదవటానికి అవకాశాలు రాని విద్యార్థులకు ఆశాకిరణంగా కనిపిస్తోంది విదేశీ మెడిసిన్! అందుకే... చాలామంది సరిహద్దులు దాటి వెళ్ళేందుకు సిద్ధమవుతున్నారు. చైనా, రష్యా, ఐరోపా దేశాలు వారిని స్వాగతిస్తున్నాయి. అయితే వైద్యవిద్యాసంస్థల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి!

కర్నూలు మెడికల్ కాలేజీలో ఓ ప్రొఫెసర్ తన కుమార్తె విదేశీ ప్రయాణానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కూడా ఈ తరహా పనిలోనే ఉన్నారు. వీరిద్దరూ తమ కుమార్తెలను ఎంబీబీఎస్ చదివించటం కోసం చైనా పంపించబోతున్నారు.

విదేశీ వైద్యవిద్యపై ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రుల్లో డాక్టర్లతో పాటు లెక్చరర్లూ, టీచర్లూ పెద్ద సంఖ్యలో ఉంటున్నారు. చైనాతో పాటు తూర్పు ఐరోపా, రష్యా దేశాలపై వారు మొగ్గు చూపిస్తున్నారు. విద్యారుణాలు కూడా లభిస్తుండటం మధ్యతరగతి విద్యార్థులకు ప్రోత్సాహాన్నిస్తోంది.

ఎంసెట్ దీక్షా, 'లాంగ్‌టర్మ్' శిక్షణా, కౌన్సెలింగ్ ఉత్కంఠా, డొనేషన్ బెడదా లాంటివాటిలో ఏదో ఒక దానితో పనిలేకుండా మన రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీటును ఊహించగలమా? విదేశీ మెడిసిన్‌కు ఈ బాదరబందీ లేమీ లేవు. ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూపులో కనీసం 50 శాతం మార్కులుంటే చాలు... వైద్యవిద్య చదివే అర్హత ఉన్నట్టే!

ఈ సంవత్సరం ఎంసెట్ మెడికల్ విభాగంలో అర్హత పొందింది 72,174 మంది. మన రాష్ట్రంలో ఉన్న ఎంబీబీఎస్ సీట్లు 4,100 మాత్రమే (ప్రభుత్వ కళాశాలల్లో 1500; ప్రైవేటు కళాశాలల్లో 2600). రెండు వేలకు మించి ర్యాంకు వచ్చినవారు ఏ కాలేజీలోనైనా ఓపెన్ కేటగిరీలో సీటు ఆశించటం కష్టమే. కర్ణాటక, మహారాష్ట్ర లాంటి పొరుగురాష్ట్రాల్లో చదవాలన్నా డొనేషన్ల భారం తప్పదు. ఇలాంటి పరిస్థితుల్లో విదేశాల్లో మెడిసిన్ ప్రత్యామ్నాయంగా ముందుకొచ్చింది. ముఖ్యంగా చైనాకు మూడేళ్ళక్రితం ప్రారంభమైన విద్యార్థుల వెల్లువ ఏటా పెరుగుతూనే ఉంది. ఇప్పుడు సెప్టెంబరు అడ్మిషన్ల తరుణం. కనీస అర్హత మార్కులు 50 శాతం అయినప్పటికీ ఇంటర్లో 70, 80 శాతం మార్కులుంటే గానీ చైనాలోని కొన్ని విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు లభించటం లేదు.

ఐరోపాతో ఆరంభం

అవిచ్ఛిన్న సోవియట్‌రష్యాలో వైద్య విశ్వవిద్యాలయాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో పెద్దఎత్తున స్థాపించారు. సబ్సిడీలను కల్పించి విరివిగా వైద్యులను తయారుచేశారు. ఆ దేశాల్లో డాక్టర్- పేషెంట్ నిష్పత్తి 1: 203 ఉంది. అంటే అవసరానికి మించిన వైద్యులున్నారన్న మాట! ఈ విధంగా ఉక్రెయిన్, బెలారస్, రష్యా లాంటి దేశాల్లో డాక్టర్లకు కొరత లేకపోవటంతో అక్కడి వైద్య విశ్వవిద్యాలయాల్లో మెడికల్ సీట్లు పూర్తిగా భర్తీ కావటం లేదు. ఈ పరిస్థితుల్లో రష్యా విచ్ఛిన్నం తర్వాత ఆ దేశాలు విదేశీమారక ద్రవ్యం కోసం విదేశీ విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి. ఇక్కడ ఎంబీబీఎస్‌ను ఎం.డి.గా వ్యవహరిస్తారు. ట్యూషన్ ఫీజులే కాదు, వసతి, భోజన ఖర్చులు కూడా మనదేశంలో కంటే తక్కువగా ఉండటం మన మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

రష్యా, ఉక్రెయిన్‌లలో చదివి, మనరాష్ట్రంలో ప్రాక్టీస్ చేస్తున్న వైద్యులు 4 వేలమందికి పైగా ఉన్నారు.

ఒకప్పుడు ఉక్రెయిన్, రష్యన్ భాషల్లో చదివినవారు ఇంగ్లిష్ వైద్యపరిభాష తెలియక స్క్రీనింగ్‌టెస్ట్‌లో విఫలమయ్యేవారు. ఇప్పుడా సమస్య లేదు. 1992 నుంచి అక్కడ ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టటం ప్రారంభమై ఇప్పుడు చాలా విశ్వవిద్యాలయాల్లో ఇంగ్లిష్ మీడియం లభిస్తోంది. ఎంబీబీఎస్ తర్వాత పీజీ కోర్సులను కూడా అక్కడే తక్కువ ఖర్చుతో చేసే సౌలభ్యం ఉంది.

విదేశీ విద్యార్థులను అనుమతించే చైనాలోని విశ్వవిద్యాలయాలూ, కళాశాలలకు సాధారణంగా ఫారిన్ స్టూడెంట్ ఏజెంట్లు ఉంటారు. Liaison office గా వ్యవహరిస్తూ నేరుగా విశ్వవిద్యాలయాలకు ప్రాతినిధ్యం వహించే వివిధ కన్సల్టెన్సీలు మనదేశం నుంచి విద్యార్థులను చైనా విద్యాసంస్థలకు పంపిస్తున్నాయి. తల్లిదండ్రులకు ఎంసీఐ మార్గదర్శకాలు వివరించటం, యూనివర్సిటీల పూర్తి సమాచారం అందించటం, అడ్మిషన్ నిర్ధారణ, వీసా స్టాంపింగ్ సహా డాక్యుమెంటేషన్ వ్యవహారాల్లో పారదర్శకంగా తాము బాధ్యత వహిస్తామని ఇవి చెపుతున్నాయి. చాలా కన్సల్టెన్సీలు ఎర్‌పోర్ట్ పికప్, హాస్టళ్ళలో విద్యార్థులను చేర్పించటం, యూనివర్సిటీలో విద్యార్థులను చేర్చే కార్యక్రమం చూసుకుంటున్నాయి. మితిమీరిన లాభాపేక్ష లేని, యూనివర్సిటీల ఆధీకృత కన్సల్టెన్సీల సాయం స్వీకరించటం ఉత్తమం.

ఈ జాగ్రత్తలు అవసరం

- WHO ప్రచురించిన 'వర్ల్డ్ డైరక్టరీ ఆఫ్ మెడికల్ స్కూల్స్'లో నమోదైన విద్యాసంస్థలోనే ప్రవేశం పొందాలి.
- బీజింగ్‌లో భారతీయ దౌత్యవేత్త లలిత్‌సూరి గత ఏడాది హెచ్చరించిన ప్రకారం- చైనీస్ వైద్య కళాశాలల ప్రమాణాలను విచారించాకే అడ్మిషన్ తీసుకోవటం ఉత్తమం. ఈ విషయంలో స్కూలు, కాలేజీల కంటే యూనివర్సిటీలను ఎంచుకుంటే సమస్యలుండవు.
- ఇంగ్లిష్ మీడియం బోధిస్తారని నిర్ధారణ చేసుకున్నాకే చేరాలి. వర్ల్డ్ డైరెక్టరీలో నమోదైనప్పటికీ ఇంగ్లిష్ మీడియం లేని విద్యాసంస్థలున్నాయి.
- ట్రెడిషనల్ చైనీస్ మెడిసిన్ (TCM) ఉన్న విద్యాసంస్థల్లో ఆక్యుపంక్చర్ లాంటి సాంప్రదాయిక వైద్యవిధానాలు బోధిస్తారు. ఆ వైద్య విధానంపై ఆసక్తి ఉంటే తప్ప వాటిలో చేరకపోవటం మంచిది. ఆ డిగ్రీకి ఎంసీఐ గుర్తింపు పట్ల రిస్క్ ఉంటుందని గమనించాలి.
- భారతీయ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారని తెలిస్తే- వారి అనుభవం ఎంతో వాకబు చేయాలి. ఒకరిద్దరు ప్రొఫెసర్లను చూసి కాకుండా విద్యాసంస్థ గురించి పూర్తి వివరాలు సేకరించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.
- వైద్య విద్యాసంస్థలకు సంబంధించి అధికారికమైన ర్యాంకులేమీ లేవు. అనధికార ర్యాంకింగులన్నీ వేర్వేరు రకాలుగా ఉంటున్నాయి. కాబట్టి ర్యాంకింగులను పెద్దగా పట్టించుకోనవసరం లేదు.

ఎంబీబీఎస్ చదవటానికి వివిధ దేశాల్లో సుమారుగా అయ్యే ట్యూషన్ ఫీజు ఖర్చును పోల్చిచూద్దాం.

భారత్	రూ. 2.76 లక్షలు
అమెరికా	రూ. 4.60 లక్షలు
చైనా	రూ. 1.38 లక్షలు
ఉక్రెయిన్	రూ. 1.38 లక్షలు
బెలారస్	రూ. 1.15 లక్షలు
రష్యా	రూ. 1.13 లక్షలు

రష్యా, చైనాల్లో భోజన ఖర్చు నెలకు సుమారు రూ. 2 వేలవుతుంది. వసతి విషయంలో చైనా (నెలకు రూ.2,500) తో పోలిస్తే ఐరోపాలో చౌక (నెలకు రూ. 1,000). కానీ ఎంబీబీఎస్ వ్యవధి ఐరోపాలో ఆరేళ్ళు కాగా చైనాలో ఐదు/ఐదున్నరేళ్ళు.

ఐరోపా దేశాల్లో 8-10 మంది విద్యార్థుల బృందానికి ఒక అధ్యాపకుడు ఉండటంతో వ్యక్తిగత శ్రద్ధకు అవకాశం ఉంటుంది. చైనాలో అయితే తరగతిలో 60-70 మంది విద్యార్థులుంటారు. కాకపోతే కంప్యూటర్లూ, ప్రొజెక్టర్లూ, సీడీల వంటి ఆధునిక ఉపకరణాల వినియోగం ఉండటం ప్రయోజనకరం.

కొన్ని సన్నాహాలు

- చైనాకు వెళ్ళేముందు మెడికల్ ఇన్సూరెన్స్, పర్సనల్ సెక్యూరిటీ ఇన్సూరెన్స్ తీసుకోవాలి.
- అడ్మిషన్ ప్రక్రియకు ఒకటి నుంచి రెండు నెలలు పడుతుంది.
- క్యాంపసుల్లో ఉండే డార్మిటరీల్లో విద్యార్థుల కుటుంబ సభ్యులకు వసతి లభించదు. పిల్లలకు తోడుగా వెళ్ళదలిచిన తల్లిదండ్రులు ముందుగానే విశ్వవిద్యాలయ అధికారుల అనుమతి పొందాల్సివుంటుంది.
- చైనా చట్టాల ప్రకారం విదేశీ విద్యార్థులు కళాశాలలో ఉంటూ ఉద్యోగాలు చేయకూడదు. అక్కడికి వెళ్ళే ముందు దీనికి సిద్ధపడి తగిన ఏర్పాట్లతో వెళ్ళాలి.

ఉపయోగపడే వెబ్‌సైట్లు

english.gov.cn/about/education.htm
www.chinaembassy.org.in/eng
www.mciindia.org
www.china.org.cn

మనరాష్ట్రం నుంచి చైనాకు వెళ్ళి ఎంబీబీఎస్ చదువుతున్న తొలి బ్యాచ్ విద్యార్థులు మరో మూడేళ్ళలో తిరిగివచ్చి ఇక్కడ ప్రాక్టీస్ ప్రారంభిస్తారు. ఇప్పటికే చైనాకు సాగుతున్న విద్యార్థుల వెల్లువ అప్పుడు మరింత ఉద్ధృతమవుతుందా? వేచి చూడాల్సిందే!

ఇవి గమనించండి!

పరాయిదేశం వెళ్ళి వైద్యవిద్య చదవాలనేది భవితను మలుపు తిప్పే నిర్ణయం. కాబట్టి ముందుగానే అన్ని అంశాలూ బేరీజు వేసుకోవాలి.

తల్లిదండ్రులు

- వైద్యవిద్య చదవాలనే గాఢమైన అభిలాష విద్యార్థిలో ఉన్నపుడే విదేశాలకు పంపించే నిర్ణయం తీసుకోవాలి. కేవలం తల్లిదండ్రులకు ఆ లక్ష్యం ఉన్నంతమాత్రాన సరిపోదు. అందుకే బలవంతంగా పిల్లలను పంపించకూడదు.
- తల్లిదండ్రులు తమ బడ్జెట్టును సరిగా వేసుకోవాలి. కోర్సు మొత్తం పూర్తయ్యేవరకూ చదివించే ఆర్థికస్థోమతపై వాస్తవిక అంచనా అవసరం. మొదటి సంవత్సరానికి సరిపడే వనరులు మాత్రమే చూసుకొని హడావుడిగా పంపించేస్తే మధ్యలో కోర్సు ఆగిపోయే ప్రమాదం ఉంటుంది. వ్యయప్రయాసలతో పాటు విద్యార్థి కెరియర్‌కూ నష్టం.
- ఈ రోజుల్లో ఎంబీబీఎస్ ఒక్కటి చదివితేనే సరిపోవటం లేదు. పీజీ కూడా తప్పనిసరి. కాబట్టి దాని ఖర్చుల గురించి కూడా తగిన ఆలోచనతో ప్రణాళిక వేసుకోవటం అవసరం.
- పిల్లలను పంపించిన తొలిదశలో తల్లిదండ్రులు supportive role పోషించాలి. తరచూ ఫోన్లో మాట్లాడుతూ, ఉత్తరాలు రాస్తూ ఉండటం మంచిది.
- 2-3 నెలల్లో విద్యార్థులు కొత్త పరిస్థితులకు అలవాటుపడిపోతారు. ఇలాంటి తరుణంలో తల్లిదండ్రులు అక్కడికి ప్రయాణం పెట్టుకోకూడదు. కావాలనుకుంటే రెండో సెమిస్టర్‌లో వెళ్ళొచ్చు.
- ఆర్థిక విషయాల్లో తొలిసారిగా పిల్లలకు స్వాతంత్ర్యం వస్తుంది కాబట్టి వారు ఎలా ఖర్చు చేస్తున్నారో గమనించటం మంచిది. డబ్బు పంపించమంటే దేనికో కనుక్కోవటం, పిల్లల స్నేహితులతో కూడా మాట్లాడుతుండటం చేయాలి. మొదటి సంవత్సరం వరకూ ఇలా జాగ్రత్తలు తీసుకుంటూవుండాలి.

విద్యార్థులు

- తల్లిదండ్రులూ, శ్రేయోభిలాషులు చెప్పారని కాకుండా నిజంగా మెడిసిన్ విద్యపై తనకు ఆసక్తి ఉన్నపుడే ముందడుగు వేయాలి.
- శారీరక దార్ఢ్యానికి సంబంధించిన (ఫిజికల్ ఫిట్‌నెస్) సర్టిఫికెట్ తప్పనిసరి. ఆస్త్మా లాంటివి లేకుండా ఉండాలి. అన్నిరకాలుగా చేసిన పరీక్షల వివరాలను ఎండీ/ సివిల్‌సర్జన్ స్థాయి వైద్యుడు సర్టిపై చేసివుండాలి.
- జీవితంలో మొదటిసారి కుటుంబానికి సుదూరంగా గడుపుతూ చదువుకోవాలి. కొత్తలో ఒంటరితనం బాధపెడుతుంది. అమ్మానాన్నా పదేపదే గుర్తొస్తుంటారు. ఒకటి రెండు నెల్లపాటు ఈ బెంగ ఉంటూనే ఉంటుంది. దానికి సంసిద్ధమవ్వాలి.
- చైనా ప్రొఫెసర్లలో కొందరి ఇంగ్లిష్ ఉచ్చారణ అర్థం చేసుకోవటం మొదట్లో కొంత ఇబ్బంది ఉండొచ్చు. ఇది పెద్ద సమస్య కాదనీ, కొద్దికాలంలోనే అలవాటవుతుందనీ సీనియర్ విద్యార్థుల అనుభవం.
- విశ్వవిద్యాలయ స్థాయిలో సెల్ఫ్ స్టడీకి చాలా ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటివరకూ తల్లిదండ్రుల పర్యవేక్షణలో చదివిన విద్యార్థులు ఇప్పుడు సొంత బాధ్యతతో చదువుకోవాల్సివస్తుంది.
- పరాయిదేశంలో ఉంటారు కాబట్టి అక్కడి నిబంధనలూ, చట్టాలను గౌరవించాలి. క్రమశిక్షణతో ప్రవర్తిస్తూ చదువుపై శ్రద్ధ చూపుతుంటే ఏ సమస్యా ఉండదు.
- వాతావరణం కొత్తగా ఉంటుంది కాబట్టి దానికి అలవాటుపడాలి. ఆహారం విషయంలో కూడా సర్దుబాటు చేసుకోవటం మంచిది. వెళ్ళేది చదువు కోసమని గుర్తుంచుకుని శ్రద్ధ చూపాలి.
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంటుంది కాబట్టి బెంగపడనక్కర్లేదు. ఇంటర్నెట్ ద్వారా కుటుంబసభ్యులతో తక్కువ ఖర్చుతోనే తరచూ మాట్లాడుతుండొచ్చు.

చైనాకు విద్యార్థుల వెల్లువ

గత ఏడాది చైనాకు వెళ్ళిన విదేశీ విద్యార్థుల సంఖ్య 1.41 లక్షలని చైనా విద్యామంత్రిత్వ శాఖ ప్రకటించింది. అంతకుముందటి సంవత్సరం కంటే ఇది 27.28 శాతం అధికం. ఈ మంత్రిత్వశాఖకు చెందిన చైనా స్కాలర్‌షిప్ కౌన్సిల్ సెక్రటరీ జనరల్ Zhang Xiuqin అభిప్రాయం ప్రకారం- 'సుస్థిరమైన సాంఘిక రాజకీయ వాతావరణం, వేగవంతమైన ఆర్థికాభివృద్ధి, అంతర్జాతీయంగా పెరుగుతున్న ప్రాముఖ్యం' దీనికి కారణాలు. విదేశీ విద్యార్థుల్లో 40 వేలమంది రిపబ్లిక్ ఆఫ్ కొరియా దేశస్థులు. 14 వేలమంది జపాన్ నుంచీ, 8 వేలమంది అమెరికా నుంచీ వచ్చినవారు.

ఎంబీబీఎస్‌కు సంబంధించి చైనాలో చదువుతున్న మనదేశ విద్యార్థులు 5 వేల మంది ఉన్నారు. వీరిలో మనరాష్ట్ర విద్యార్థులు 2 వేల వరకూ ఉంటారు. 2005లో మనదేశం నుంచి 2వేలమంది చైనాకు వైద్యవిద్య చదవటానికి వెళ్ళి ఉంటారని అంచనా. మనరాష్ట్రం నుంచి వెళ్ళినవారు దాదాపు 800 మంది.

అధ్యయనానికీ, పరిశోధనకూ ఉపయోగపడే అత్యాధునిక బోధన సదుపాయాలూ, అనుబంధ ఆస్పత్రులూ, ప్రయోగశాలలను ఇక్కడి విద్యాసంస్థలు సమకూర్చుకున్నాయి.

బోధన ఇంగ్లిష్ మీడియంలో ఉన్నప్పటికీ విద్యార్థుల చదువులు సాఫీగా సాగటానికీ, నిత్యజీవితావసరాలకూ కొంతస్థాయి వరకూ చైనీస్ నేర్చుకోవాల్సివుంటుంది. అందుకనే విదేశీ విద్యార్థులు అక్కడికి వెళ్ళాక ప్రాథమిక స్థాయిలో చైనీస్‌ను ఒకటి/రెండు విద్యాసంవత్సరాలు బోధిస్తారు.

సందిగ్ధతను తొలగించిన MCI

మనదేశంలోని వైద్యవిద్యపై సర్వోన్నత సంస్థ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (MCI). గతంలో ఇది ప్రపంచంలోని కొన్ని వైద్యవిశ్వవిద్యాలయాలను గుర్తించి, అక్కడి ఎంబీబీఎస్‌కే గుర్తింపు ఇచ్చేది. అయితే నాలుగేళ్ళ క్రితం ఎంసీఐ కీలక ప్రకటన చేసి విదేశీ వైద్యవిద్యకు సంబంధించి మనదేశంలో అప్పటివరకూ ఉన్న సందిగ్ధతను తొలగించివేసింది.

2002 ఫిబ్రవరి 18న ఎంసీఐ ప్రకటించిన అసాధారణ గెజిట్ ఆఫ్ ఇండియా ప్రకారం- 'భారతీయ విద్యార్థులు ఏ దేశంలోని వైద్యవిద్యా సంస్థల్లోనైనా ఎంబీబీఎస్‌ను చదువుకోవచ్చు. అయితే ఆ విద్యాసంస్థ ప్రపంచ ఆరోగ్యసంస్థ (WHO) డైరక్టరీలో నమోదై ఉండాలి. అలాంటి విద్యాసంస్థల్లో ఎంబీబీఎస్ చదవటానికి వెళ్ళే ముందు ఎంసీఐ, న్యూఢిల్లీ నుంచి ఎలిజిబిలిటీ సర్టిఫికెట్‌ను పొందాలి. అంతేకాకుండా కోర్సు పూర్తిచేసి వచ్చాక ఎంసీఐ నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరై ఉత్తీర్ణత పొందాలి. అప్పుడు మాత్రమే డాక్టరుగా ప్రభుత్వ రిజిస్ట్రేషన్ (లైసెన్స్) లభిస్తుంది'.

వర్ల్డ్ డైరక్టరీ

ప్రపంచ ఆరోగ్యసంస్థ (WHO) ప్రచురించిన 'World Directory of Medical Schools' ఏడో ఎడిషన్లో 157 దేశాలు/ప్రాంతాలకు చెందిన 1642 వైద్యవిద్యాసంస్థల సమాచారం ఉంది. ఇంటర్నెట్లో www. who.int/hrh/wdms/en వెబ్‌సైట్లో ఈ పుస్తకాన్ని సందర్శించవచ్చు.

చైనాలో ఇంగ్లిష్ మీడియం ఉన్న ముఖ్యమైన వైద్య విశ్వవిద్యాలయాలు (వర్ల్డ్ డైరెక్టరీలో నమోదైనవి)

సంఖ్య	విశ్వవిద్యాలయం	స్థాపన	ప్రావిన్స్
1	ANHUI MEDICAL UNIVERSITY	1949	ANHUI
2	SUN YAT-SEN UNIVERSITY OF MEDICAL SCIENCES	1866	BEIJING
3	GUANXI MEDICAL UNIVERSITY	1934	GUANXI
4	HEBEI MEDICAL UNIVERSITY	1970	HEBEI
5	HARBIN MEDICAL UNIVERSITY	1926	HEILONGJIANG
6	HENAN MEDICAL UNIVERSITY	1953	HENAN
7	THE CHINESE UNIVERSITY OF HONGKONG, SHATIN	1981	HONGKONG SAR
8	HUBEI MEDICAL UNIVERSITY	1943	HUBEI
9	NANJING MEDICAL UNIVERSITY	1934	JIANGSU
10	BETHUNE MEDICAL UNIVERSITY	1938	JILIN
11	DALIAN MEDICAL UNIVERSITY	1947	LIAONING
12	JINZHOU MEDICAL UNIVERSITY	1946	LIAONING
13	CHINA MEDICAL UNIVERSITY	1931	LIAONING
14	SHANDONG MEDICAL UNIVERSITY	1948	SHANDONG
15	WEST CHINA UNIVERSITY OF MEDICAL SCIENCES	1910	SICHUAN
16	CHONGQING MEDICAL UNIVERSITY	1956	SICHUAN
17	TIANJIN MEDICAL UNIVERSITY	1952	TIANJIN
18	ZHEJIANG MEDICAL UNIVERSITY	1912	ZHEJIANG

ప్రతి మధ్యతరగతి కుటుంబంలో ఓ డాక్టరు

అంతర్జాతీయ వైద్యప్రమాణాల ప్రకారం డాక్టరు- పేషెంట్ నిష్పత్తి 1: 250 ఉండాలి. అయితే WHO సర్వే ప్రకారం మనదేశంలో ఇది 1: 3,500గా ఉంది. ఇక్కడ వైద్యుల అవసరం ఎంత ఉందో ఇది స్పష్టం చేస్తుంది. చైనా, ఐరోపా, కిర్గిజిస్థాన్ లాంటి మధ్య ఆసియా దేశాలు అంతర్జాతీయ ప్రమాణాల్లో వైద్యవిద్యను అందిస్తున్నాయి. దీన్ని మన విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే ప్రతి మధ్యతరగతి కుటుంబం నుంచీ ఒక డాక్టరు తయారుకావటం సాధ్యమే! పీజీ కోర్సులను కూడా తక్కువ ఖర్చుతో చేసే సౌలభ్యం ఉంది. గత ఏడాది మా సంస్థ ద్వారా 150 మంది విద్యార్థులు చైనాకు వెళ్ళి ఎంబీబీఎస్‌లో చేరారు. పీజీ కోర్సుల్లో ఐదుగురు జాయినయ్యారు.

ప్రతి విద్యాసంస్థలోకీ 12వేల నుంచి 15 వేలమంది విద్యార్థులను చేర్చుకోగల విస్తృతస్థాయి భవనాలూ, ప్రయోగశాలలూ చైనా విశ్వవిద్యాలయాల ప్రత్యేకత. బోధన సిబ్బందికి జీతాలూ, ఇతర సౌకర్యాలూ, సంస్థలకు అవసరమయ్యే సదుపాయాలూ ప్రభుత్వమే చూసుకుంటుంది. విద్యార్థులపై భారం మోపే అవసరం లేదు. విదేశీ విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం ఫ్యాకల్టీని ఏర్పాటు చేసేందుకు మాత్రమే ట్యూషన్ ఫీజు వసూలు చేస్తున్నారు. చైనాలో వ్యయం తగ్గటానికి ఇవన్నీ కారణాలే.

- వి. రాజారామ్,
మేనేజింగ్ మ్యానేజర్, మెడిసిటీ-అబ్రాడ్

ఎలాంటి సందేహాలకూ తావు లేదు

చైనాలో ఎంబీబీఎస్ చదువుతున్న మన విద్యార్థులు తమ కల నిజమైందని సంతోషంగా ఉంటున్నారు. మనదేశంలో కంటే చైనా వైద్యవిద్యాసంస్థల్లో ఎక్కువ మౌలిక సదుపాయాలున్నాయి. అమెరికాలో శిక్షణ పొందిన ప్రొఫెసర్లతో బోధన జరుగుతుంది. వైద్య విద్యాసంస్థలన్నీ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడుస్తుంటాయి. ఇక్కడ డిగ్రీల గుర్తింపు విషయంలో సందేహాలేమీ పెట్టుకోనక్కర్లేదు. మా సంస్థ ద్వారా గత ఏడాది 405 మంది చైనాలో ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశించారు. నలుగురు పీజీలో చేరారు.

మనదేశ విద్యార్థులు బాగా చదువుతారని చైనాలో మంచి పేరుంది. చైనా ప్రజలు విదేశీ విద్యార్థులంటే... ముఖ్యంగా భారతీయ విద్యార్థులంటే బాగా గౌరవం ఇస్తారు. ఆప్యాయంగా ఉంటారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్ అస్సలుండదు. పోకిరీల బెడద లేకపోవటం వల్ల విద్యార్థినులు నిర్భయంగా చదువుకొనసాగిస్తుంటారు.

- ఎస్. జైపాల్‌రెడ్డి,
ఎండీ, సెంట్ థోమస్ట్ కన్సల్టెంట్స్